# భవఘ్ని పీఠం

# పరమాత్మకు ప్రతిరూపం

**భవఘ్ని ఆరామం, వైకుంఠపురం**

# విషయ సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | భవఘ్ని పీఠంలో ఉండవలసిన సామగ్రి | 3 |
| 2. | భవఘ్ని పీఠం యొక్క ప్రయోజనాలు | 4 |
| 3. | శ్రీమద్భగవద్గీత వైభవము | 6 |
| 4. | శ్రీమద్భగవద్గీత ఆరాధనా విధానము | 11 |
| 5. | పరమాత్మ ప్రార్థన | 13 |
| 6. | శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యము | 14 |
| 7. | భగవద్గీత ధ్యానము | 14 |
| 8. | అష్టోత్తర శతనామావళి | 15 |
| 9. | సంక్షిప్త గీత | 19 |
| 10. | శాంతి ప్రార్థన | 21 |
| 11. | యజ్ఞ దాన తపోకర్మలు | 22 |
| 12. | గీతాజయంతి | 25 |


ఓం

## భవఘ్ని పీఠంలో ఉండవలసిన సామగ్రి

1. పసుపు వస్త్రం
2. పరమాత్మ ప్రార్థన
3. భవఘ్ని చిహ్నం
4. శాంతి ప్రార్థన
5. శ్రీమద్భగవద్గీతా గ్రంథము
6. వ్యాస పీఠం
7. ధర్మనిధి
8. విభూతి భరిణ
9. జ్యోతి ప్రకాశన సామగ్రి
10. అగరువత్తులు
11. భగవద్గీత ఆరాధన పుస్తకము
12. భవఘ్ని మహా శాంతియజ్ఞం పుస్తకము

⁂

## భవఘ్ని పీఠం యొక్క ప్రయోజనాలు

- ఇంట్లో పిల్లలు, పెద్దలు అందరూ ఒకే భావనతో పీఠం ప్రతిష్ఠించుకొని, అందులోని విషయాలను ఆచరణలోనికి తీసుకోవటం వల్ల నైతికవిలువలతో కూడిన విజయము, సంపద, సుఖశాంతులు పొందుతారు.
- అందరిలోను సద్భావన ఏర్పడి, ప్రేమ, కరుణ, శాంతి వృద్ధి చెందుతాయి.
- మహోన్నతమైన జ్ఞానాన్ని తెలుసుకొని, సుఖశాంతులతో, సంతృప్తిగా జీవిస్తూ మానవజన్మ సార్థకం చేసుకొంటారు.
- సృష్టికర్త ఒక్కడేనని ఆయననే ఆరాధిస్తూ ఉండటం వల్ల మతద్వేషాలు, ఘర్షణలు లేకుండా, సోదర భావనతో శాంతియుతంగా జీవించ గలరు.
- ఆధ్యాత్మిక జీవితంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ జీవన్ముక్తులై కడకు పరమపదాన్ని పొందగలరు.
- శాంతి సామరస్యాలతో గృహమే స్వర్గసీమలా మారుతుంది.
- భగవద్గీత విశిష్టత తెలుసుకొని గీత పట్ల భక్తి, విశ్వాసాలు పెంచుకోవటానికి వీలవుతుంది.
- ఇంట్లో సత్ సంప్రదాయం ఏర్పడి, తరతరాలు కొనసాగుతుంది.
- పరమాత్మ బోధ ప్రకారం జీవితాన్ని సాగిస్తున్నామనే సంతృప్తి కలుగుతుంది.
- అనుక్షణమూ పరమాత్మకు దగ్గరగా ఉన్నామనే భావన పెరుగుతుంది.
- పరమాత్మ తోడై ఉన్నాడు అనే భావం ఏర్పడి, ఏ పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించగలరు.
- శాంతి, సహనం కోల్పోకుండా ఉండటానికి కావలసిన శక్తి పెరుగుతుంది.

- ❖ ఈర్ష్య, అసూయ, ద్వేషం, శత్రుభావనలు పోయి, స్నేహ భావన ఏర్పడుతుంది.
- ❖ రాగద్వేషాలు తొలగిపోయి, చక్కటి అంతర్ పరివర్తన ఏర్పడుతుంది.
- ❖ కుటుంబంలో అందరి మధ్య సమన్వయం ఏర్పడి, ఆత్మీయతానురాగాలు వృద్ధి చెందుతాయి.
- ❖ పిల్లలు చెడు అలవాట్లు, వ్యసనాల వైపు వెళ్లకుండా ఆదర్శవంతులుగా మారతారు.
- ❖ పిల్లలలో ఏకాగ్రత, పట్టుదల, సహనం, వినమ్రత వృద్ధి చెందుతాయి.
- ❖ పిల్లలు సన్మార్గంలో నడుస్తూ ఉన్నతస్థితికి చేరుకోగలుగుతారు.
- ❖ కుటుంబంలో అందరిలోను నియమ నిబద్ధతలు ఏర్పడతాయి.
- ❖ అలజడి, ఆందోళన, భయం లేకుండా శాంతిగా, సంతోషంగా, సంతృప్తిగా ఉండగలుగుతారు.
- ❖ సర్వదోషాల నుండి విముక్తులై సుఖంగా జీవించగలరు.
- ❖ భవఘ్నిపీఠం భారతీయ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా ఉండి, ప్రతి మనిషిలో ఉన్న ఆత్మచైతన్యాన్ని జాగృతం చేసి శక్తిమంతులుగా చేస్తుంది.
- ❖ ఎవ్వరికైనా, ఏ కాలానికైనా, ఏ దేశానికైనా సానుకూలంగా ఉండి, అన్ని విధాల సంతృప్తికరమైన ఆధ్యాత్మిక విధానమవుతుంది.
- ❖ భవఘ్ని పీఠం వద్ద నిర్దేశిత నియమాలను నియమబద్ధంగా ప్రతినిత్యం ఆచరించటం వల్ల అనేక ప్రయోజనాలను ఎవరికి వారే అనుభవ పూర్వకంగా పొందవచ్చు.

**పెద్దల ఆచరణ బిడ్డలకు మార్గదర్శకం కావాలి.**
**బిడ్డలకు మనం ఇవ్వగలిగిన అసలైన సంపద ఇదే.**
**ఆలోచించుదాము, ఆచరించుదాము.**
**అందరమూ ఒకే కుటుంబంలా కలసి నడుద్దాము.**

## శ్రీ మద్భగవద్గీత వైభవము

ప్రారబ్ధానికి అధీనుడై దుఃఖ సాగరంలో మునిగిపోతూ జనన మరణ చక్రంలో పరిభ్రమిస్తూ ఎలా బయటపడాలో మార్గం తెలియక సతమతమవుతున్న మనిషి సుఖశాంతులతో, సంతోషంగా జీవిస్తూ జన్మ సార్థకం చేసుకోవటానికి భగవత్ స్వరూపులైన శ్రీ వేదవ్యాస మహర్షుల వారు శ్రీమద్భగవద్గీతను మానవాళికి ప్రసాదించారు.

ప్రారబ్ధ దుఃఖాన్ని అనుభవిస్తున్న మనిషి ఆ దుఃఖం నుండి బయటపడి, నిశ్చలమైన భక్తితో సుఖశాంతులతో జీవిస్తూ మానవజన్మ సఫలం చేసుకొని, మోక్షం పొందటానికి దిక్సూచిలా ఉపయోగపడే మహోన్నతమైన పవిత్ర గ్రంథమే శ్రీమద్భగవద్గీత.

ఈ ప్రపంచంలో శుభప్రదమైన పవిత్ర గ్రంథాలు ఎన్ని ఉన్నప్పటికీ శ్రీమద్భగవద్గీత అపురూపమైన సాటిలేని మేటి గ్రంథరాజం అనుటలో అతిశయోక్తి లేనే లేదు.

'సాక్షాత్తూ భగవంతుని ముఖారవిందము నుండి వెలువడిన శ్రీమద్భగవద్గీత ఉండగా ఇంక ఇతర గ్రంథములతో పని యేమి' అని వ్యాస మహర్షులవారు చెపుతున్నారు. శ్రీమద్భగవద్గీతలోని శ్లోకాలకు ముందు 'భగవాన్ ఉవాచ' అని ఉంటుంది. అంటే భగవంతుడు చెపుతున్నాడు అని అర్థం.

**'ఇందు గలడందు లేడను సందేహము వలదు..**
**ఎందెందు వెదకి చూచిన అందందే కలడు'**

నిశ్చయంగా భగవంతుడు లేని తావు లేనే లేదు. అన్నిటా ఉన్నాడు, అంతటా ఉన్నాడు. కానీ శ్రీమద్భగవద్గీతలో మాత్రమే ఆయన బిడ్డలమైన మన కోసం మన సుఖశాంతులకోసం మనం ఏది చెయ్యాలో, ఏది చెయ్యకూడదో అద్భుతమైన రీతిలో బోధ చేస్తున్నారు.

మనం ఎలా జీవిస్తే సుఖశాంతులతో ఉంటామో, ఏ అవగాహన చేసుకుంటే ఈ మానవజన్మ సార్థకం అవుతుందో, ఏ జ్ఞానం వల్ల మన అజ్ఞానాన్ని పోగొట్టుకొంటామో, ఏది తెలుసుకొంటే ఇకపై తెలుసుకోవలసినది మరేది ఉండదో అటువంటి పరమ పవిత్రమైన జ్ఞానామృతాన్ని శ్రీమద్భగవద్గీత రూపంలో స్వయంగా భగవంతుడే ఆయన బిడ్డలమైన మనకోసం తెలియజేస్తున్నారు. ఏకైక సృష్టికర్త, మన అందరి తండ్రి అయిన ఆ భగవంతుడు మన శ్రేయస్సు కొరకు మనకు చేస్తున్న బోధ స్వరూపమే శ్రీమద్భగవద్గీత.

**గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్ ।**
**గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీన్ లోకాన్ పాలయామ్యహమ్॥**

'నేను గీతకు ఆధారముగా ఉన్నాను. గీత నా ఉత్తమ గృహమై ఉన్నది. గీతాజ్ఞానమును ఆశ్రయించి నేను ముల్లోకాలను పాలిస్తున్నాను' అని భగవంతుడే స్వయంగా చెప్తున్నారంటే శ్రీమద్భగవద్గీత యొక్క విశిష్టత గురించి చెప్పటానికి ఎవ్వరి తరమూ కాదు.

ఇక్కడ అనేకులు వారి దోషాలను పాపాలను పోగొట్టుకొనడానికి, కోరికలు నెరవేర్చుకోవడానికి ఎందరో దేవతలను, మహాత్ములను ఆరాధిస్తూ, అనేక తీర్థాలకు వెళుతూ ఉంటారు. అయితే భగవంతుడు ఏం చెప్తున్నారో చూడండి.

**గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।**
**తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై ॥**
**సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే ।**
**గోపాలా గోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః ।**
**సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే ॥**

'ఎవ్వరి గృహంలో శ్రీమద్భగవద్గీత సాక్షాత్ పరమాత్మ స్వరూపంగా ఆరాధించబడుతూ, అధ్యయనము చేయబడుతూ, ఆచరించబడుతూ

ఉంటుందో అక్కడ ప్రయాగాది సకల తీర్థములు, సకల దేవతలు, ఋషులు, యోగులు, నారదుడు, ఉద్ధవాది సకల మహాత్ములు, మహర్షులు అందరూ వారి గృహంలోనే కొలువై ఉండి, వారికి అన్ని విషయాలలోనూ శీఘ్రంగా అంటే వెంటనే సహాయం చేస్తారు' అని భగవంతుడే చెపుతున్నారు. కనుక ఆ గృహంలోని వారు సకల శుభాలతో ఉంటారు అనటంలో ఇంక సందేహం లేనే లేదు. ఇంతకన్నా ఏం కావాలి?

**మహా పాపాది పాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।**
**క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నలినీదళమంభసా ॥**

తామరాకుకు నీరు అంటుకోని విధంగా, గీతను అధ్యయనం చేస్తున్నటువంటి వ్యక్తికి ఏ పాపాలు కూడా అంటుకోవు. గీతారాధన, గీతాపఠనము సకల పాప, సకల దోష నివారిణి అని మహాత్ములందరూ ముక్తకంఠంతో చెప్తున్నారు.

గీతారాధన, గీతాపఠనం, గీత ఆచరణలవల్ల అందరూ సకల శు భాలను పొందగలరు. ఇంటిల్లిపాదీ, వారి వారి దోషాలనుండి, పాపాలనుండి బయటపడి వైభవంతో జీవిస్తూ, సంపదలను అనుభవిస్తూ, విజయవంతంగా సుఖశాంతులతో ఉంటారు. ఆ గృహంలోని వ్యక్తులంతా, ప్రతి క్షణమూ పరమాత్మ అనుగ్రహంతో పాటు, మహాత్ములందరి ఆశీర్వాదాన్ని పొందుతూ అన్నివిధాలా పరమాత్మ యొక్క పరమశాంతిని పొందుతూ జన్మ సార్థకం చేసుకొంటారని మహాత్ములు చెపుతున్నారు.

'గీతా మే హృదయం పార్థ' – శ్రీమద్భగవద్గీత నా హృదయమే – అని భగవంతుడు చెప్తున్నారు. శ్రీమద్భగవద్గీతను కేవలం ఒక గ్రంథంగా కాక సాక్షాత్ పరమాత్మ స్వరూపంగా సకల దేవతా స్వరూపంగా భావన చేసుకోవాలి.

'గీతా మే చోత్తమం గృహమ్' – గీత నా ఉత్తమ నివాస స్థానము'

– అని పరమాత్మ చెప్తున్నారు.

**'విద్యానామ్ అధ్యాత్మ విద్యోఽహమ్'**
**'గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః'**

అధ్యాత్మవిద్య – బ్రహ్మవిద్య అయిన 'భగవద్గీత నేనే' అని భగవంతుడు చెప్తున్నారు. స్వయంగా 'భగవద్గీతకూ నాకూ ఏ భేదము లేదని చెప్తున్నారు.

**శ్రీమద్భగవద్గీత సాక్షాత్ భగవంతుడే!**

ఇందులో మరే సందేహమూ లేనే లేదు.

భగవద్గీత కేవలం ఒక గ్రంథము కాదు. అవ్యక్త స్వరూపుడైన పరమాత్మకు ప్రతిరూపమే భగవద్గీత! భగవద్గీతా రూపంలో భగవంతుడు మన తండ్రిగా మన గృహంలో కొలువై మనకు మంచి చెడూ తెలియచేస్తూ, అజ్ఞానాన్ని పారద్రోలి సుఖశాంతులను ప్రసాదిస్తున్నారు.

**అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।**
**జ్ఞానయజ్ఞేన తేనాహమ్ ఇష్టః స్యామితి మే మతిః ॥**

(అ18-శ్లో70)

శ్రీమద్భగవద్గీత సాక్షాత్ భగవత్ స్వరూపమే అన్న విశ్వాసంతో ఎవరైతే అరాధన పూర్వకంగా భగవద్గీత పఠిస్తారో వారు జ్ఞానయజ్ఞం ద్వారా నన్ను పూజించినట్లు అవుతుంది అని భగవంతుడు చెప్తున్నారు.

**శ్రేయాన్ ద్రవ్యమయాత్ యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప**

(అ4-శ్లో33)

అన్ని యజ్ఞాలకంటే జ్ఞానయజ్ఞమే శ్రేష్ఠమైనదని భగవంతుడే చెప్తున్నారు. కనుక, గీతారాధన చేసుకొని శ్రీమద్భగవద్గీతను పఠించినట్లయితే, అంతకంటే గొప్ప పూజ కాని, గొప్ప యజ్ఞం కాని మరేదీ లేదు. గీతా పఠనము చేస్తుంటే సర్వశుభాలనూ పొందవచ్చు.

సాక్షాత్ పరమాత్మ మన ఇంట్లోనే శ్రీమద్భగద్గీతా రూపంలో కొలువై ఉన్నారనే విశ్వాసంతో ఆరాధించాలి. శ్రీమద్భగవద్గీతను ఆరాధిస్తూ, గీతను పఠిస్తూ, ఆచరిస్తూ ఉంటే సకల దేవతలను, సకల మహర్షులను, మహాత్ములను, తీర్థాలను, సకల యోగులనూ ఆరాధించినట్లే అవుతుంది. కనుక ఈ విశ్వాసంతో భగవద్గీతను ఆరాధిస్తే సకల శుభాలనూ పొందవచ్చు.

ఈ విశ్వాసంతో భగవద్గీతను ఆరాధించాలి. ఈ విశ్వాసంతో భగవద్గీతను పఠించాలి. ఈ విశ్వాసంతో భగవద్గీతను ఆచరించాలి. ఈ విశ్వాసంతో గీతాజయంతి పండుగ చేసుకోవాలి. ఈ విశ్వాసంతో ఈ సంప్రదాయాన్ని తరతరాలకు అందించాలి.

వర్ణించనలవి కాని ఇంతటి గీతామాహాత్మ్యాన్ని అందరూ అనుభవానికి తెచ్చుకోగలుగుతారు. ఇది సత్యం, ఇది ముమ్మాటికీ సత్యం. గీతారాధన, గీతాధ్యయనం చేస్తున్నప్పుడు స్వయంగా పరమాత్మే మీ చేయి పట్టుకుని మిమ్ములను నడిపిస్తున్నారన్న అనుభూతి ప్రతి ఒక్కరు పొందగలుగుతారు. ఇది చెయ్యాలి, ఇది చెయ్యవద్దు అని ప్రతిక్షణమూ మీకు బోధ చేస్తూ, మీకు ఎల్లవేళలా పరమాత్మ తోడై ఉంటున్నారన్నది మీకు అనుభవమవుతుంది.

## <u>శ్రీమద్భగవద్గీత ఆరాధనా విధానము</u>

శ్రీమద్భగవద్గీతా స్వరూపమై మన ఇంట్లో అత్యంత వైభవంగా కొలువై ఉన్న పరమాత్మను భక్తి శ్రద్ధలతో ఆరాధించుకోవటానికి –

**కావలసిన పూజా సామగ్రి :–**

- శ్రీమద్భగవద్గీత గ్రంథం
- దీపం కుందులు
- నూనె, వత్తులు
- అగ్గిపెట్టె
- అగరువత్తులు
- కర్పూరం
- హారతి పళ్ళెం
- గీతను ప్రతిష్ఠించుకోవడానికి ఎత్తైన పీట/వ్యాసపీఠం
- పీఠం మీద పరుచుకోవడానికి పసుపు రంగు వస్త్రం
- ఆరాధన చేసుకోవడానికి 108 పుష్పాలు. (పుష్పాలు లేనపుడు పుష్పాలు సమర్పిస్తున్నట్లుగా భావన చేసుకున్నా మంచి ఫలితం వస్తుంది.)

**ఆరాధనా విధానము :-**

శ్రీమద్భగవద్గీతను సాక్షాత్ పరమాత్మ స్వరూపంగా భావిస్తూ భక్తి శ్రద్ధలతో ముందుగా ఏర్పాటు చేసుకున్న ఉన్నతస్థానం మీద ప్రతిష్ఠ చేసుకోవాలి. గురు ప్రార్థనతో ఆరాధన ప్రారంభిస్తూ -

**ఓం శ్రీ గురుభ్యో నమః**

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।**
**గురుస్సాక్షాత్ పరం బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥**

అని భక్తిపూర్వకంగా చేతులు జోడించి నమస్కరించుకోవాలి.

**జ్యోతి ప్రకాశనం :-**

జ్యోతి ప్రకాశనం చేస్తున్నపుడు శ్రీమద్భగవద్గీతా రూపంలో ఉన్న పరమాత్మే పరంజ్యోతి స్వరూపుడని భావిస్తూ -

**జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే ।**
**జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥**

(అ13-శ్లో17)

ఓం తత్ సత్ హరిః ఓం తత్ సత్

అన్నింటినీ ప్రకాశింప జేస్తున్న పరమాత్మే పరంజ్యోతి స్వరూపుడు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, సమస్త జగత్తును ప్రకాశింపజేస్తున్నది పరమాత్మే. మనలో అంతర్యామిగా ఉండి, బుద్ధిని, మనస్సును ప్రకాశింప జేస్తున్నది పరమాత్మే. జ్ఞానమూ, జ్ఞేయమూ, జ్ఞానగమ్యమూ పరమాత్మే అన్న భావన చేసుకొని, అగరువత్తులు వెలిగించుకొని, భగవద్గీతా మాహాత్మ్యాన్ని స్మరించుకోవాలి.

## పరమాత్మ ప్రార్థన

ఇక్కడ ఎందరో దేవతలకు ఎన్నో రకాలుగా ఎందరో ప్రార్థనలు చేస్తూ ఉంటారు. అయితే శ్రీమద్భగవద్గీత 'విశ్వరూప సందర్శన యోగం'లో మనకు అందించిన మహిమాన్వితమైన 'పరమాత్మ ప్రార్థన' మనం నిత్యం చేసుకుంటూ ఉన్నపుడు సృష్టికర్త మన తండ్రి శ్రీమద్భగవద్గీతా స్వరూపుడైన ఏకైక పరమాత్మతో పాటు సకల దేవతలను కూడా ప్రార్థించినట్లు అవుతుంది.

**త్వమాదిదేవః పురుషః పురాణః త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనంతరూప ॥**
**వాయుర్యమోఽగ్ని ర్వరుణ శ్శశాంకః ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ ।**
**నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే ॥**

(అ11–శ్లో38,39)

ఆదిదేవా! అనంతరూపా! పురాణపురుషా! విశ్వానికి పరమాశ్రయమైన పరంధామా! సర్వజ్ఞుడవు, సర్వవ్యాపకుడవైన నీవే సర్వవేద్యుడవు! వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, ప్రజాపతి, ప్రపితామహుడవైన నీకు నమస్కరిస్తున్నాను తండ్రీ! వేలకొలది సార్లు మరల మరల నమస్కరిస్తున్నాను తండ్రీ!

ఇంతటి మహిమాన్వితమైన ఈ ప్రార్థన ప్రతిరోజు ప్రతి ఇంట్లో చేసుకుంటున్నట్లయితే సకల దేవతలను, సకల మహర్షులను, మహాత్ములను, తీర్థాలను, సకల యోగులనూ ఆరాధించినట్లే అవుతుంది. కనుక ఈ ప్రార్థన గృహంలో అందరూ చేసుకుంటే సకల సౌభాగ్యాలను పొందుతారనడంలో ఏ మాత్రమూ అతిశయోక్తి లేదు.

## శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యము
## శ్రీ భగవాన్ ఉవాచ

గీతా మే హృదయం పార్థ గీతా మే సార ముత్తమమ్ ।
గీతా మే జ్ఞాన మత్యుగ్రం గీతా మే జ్ఞాన మవ్యయమ్ ॥

గీతా మే చోత్తమం స్థానం గీతా మే పరమం పదమ్ ।
గీతా మే పరమం గుహ్యం గీతా మే పరమో గురుః ॥

గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్ ।
గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీన్ లోకాన్ పాలయామ్యహమ్ ॥

మహా పాపాది పాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।
క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నలినీదళమంభసా ॥

తాపత్రయోద్భవా పీడా నైవ వ్యాధిర్భవేత్ క్వచిత్ ।
న శాపో నైవ పాపంచ దుర్గతిర్నరకం న చ ॥

అభిచారోద్భవం దుఃఖం వరశాపాగతం చ యత్ ।
నోపసర్పన్తి తత్రైవ యత్ర గీతార్చనం గృహే ॥

గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।
తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై ॥

సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే ।
గోపాల గోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః ।
సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే ॥

## భగవద్గీతా ధ్యానము

ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।
అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥

## <u>అష్టోత్తర శతనామావళి</u>

1. ఓం శ్రీమద్భగవద్గీతా మాత్రే నమః
2. ఓం పరమాత్మ స్వరూపిణ్యై నమః
3. ఓం సద్గురు స్వరూపిణ్యై నమః
4. ఓం సచ్చిదానంద స్వరూపిణ్యై నమః
5. ఓం సనాతనధర్మ స్వరూపిణ్యై నమః
6. ఓం సకలదేవతా స్వరూపిణ్యై నమః
7. ఓం సకలశాస్త్ర స్వరూపిణ్యై నమః
8. ఓం సకలతీర్థ స్వరూపిణ్యై నమః
9. ఓం శాంతి స్వరూపిణ్యై నమః
10. ఓం శక్తి స్వరూపిణ్యై నమః
11. ఓం సాధు స్వరూపిణ్యై నమః
12. ఓం అద్వైత స్వరూపిణ్యై నమః
13. ఓం వేద స్వరూపిణ్యై నమః
14. ఓం పరమధర్మ స్వరూపిణ్యై నమః
15. ఓం మంగళ స్వరూపిణ్యై నమః
16. ఓం అమృత స్వరూపిణ్యై నమః
17. ఓం అనంతజ్ఞాన స్వరూపిణ్యై నమః
18. ఓం సర్వోపనిషత్సార రూపిణ్యై నమః
19. ఓం తత్త్వ ప్రబోధిన్యై నమః
20. ఓం సాధు గమ్యాయై నమః
21. ఓం పరమ పవిత్రాయై నమః
22. ఓం మహా మహిమాన్వితాయై నమః
23. ఓం వ్యాస సంగ్రథితాయై నమః
24. ఓం అష్టాదశాధ్యాయిన్యై నమః
25. ఓం బ్రహ్మ విష్ణు శివాత్మికాయై నమః
26. ఓం మోక్ష ప్రదాయై నమః
27. ఓం ధ్యాన ప్రదాయై నమః

28. ఓం దివ్యశక్తి ప్రదాయై నమః
29. ఓం దైవ సంపత్ ప్రదాయై నమః
30. ఓం కర్మయోగ ప్రదాయై నమః
31. ఓం భక్తి జ్ఞాన వైరాగ్య ప్రదాయై నమః
32. ఓం విజయ ప్రదాయై నమః
33. ఓం సద్గుణ ప్రదాయై నమః
34. ఓం అభయ ప్రదాయై నమః
35. ఓం నిత్యానంద ప్రదాయై నమః
36. ఓం పరమశాంతి ప్రదాయై నమః
37. ఓం ప్రేమ ప్రదాయై నమః
38. ఓం సకల శుభప్రదాయై నమః
39. ఓం సదాచార ప్రదాయై నమః
40. ఓం ఆత్మానుభూతి ప్రదాయై నమః
41. ఓం సాంఖ్యబుద్ధి ప్రదాయై నమః
42. ఓం సనాతనధర్మ ప్రదాయై నమః
43. ఓం పుణ్య ప్రదాయై నమః
44. ఓం సర్వ కామఫల ప్రదాయై నమః
45. ఓం సర్వమంగళ ప్రదాయై నమః
46. ఓం అమృతప్రదాయై నమః
47. ఓం స్మృతిప్రదాయై నమః
48. ఓం సిద్ధిప్రదాయై నమః
49. ఓం పరాభక్తి ప్రదాయై నమః
50. ఓం పరమజ్ఞాన ప్రదాయై నమః
51. ఓం యోగక్షేమ ప్రదాయై నమః
52. ఓం క్షేత్ర క్షేత్రజ్ఞ జ్ఞాన ప్రదాయై నమః
53. ఓం గుణాతీత స్థితి ప్రదాయై నమః
54. ఓం పరమ సుఖ ప్రదాయై నమః
55. ఓం సమభావ ప్రదాయై నమః

56. ఓం సర్వభూత హితాయై నమః
57. ఓం కర్తవ్యబోధిన్యై నమః
58. ఓం సన్మార్గదర్శిన్యై నమః
59. ఓం లోకోద్ధారిణ్యై నమః
60. ఓం లోక కళ్యాణకారిణ్యై నమః
61. ఓం కృపా కటాక్షిణ్యై నమః
62. ఓం కారుణ్యాయై నమః
63. ఓం అక్షరాయై నమః
64. ఓం దుఃఖహారిణ్యై నమః
65. ఓం అజ్ఞాన ధ్వంసిన్యై నమః
66. ఓం భవ భయ నాశిన్యై నమః
67. ఓం త్రితాప హారిణ్యై నమః
68. ఓం సకల దోష నివారిణ్యై నమః
69. ఓం సకల పాప హారిణ్యై నమః
70. ఓం అసురభావ ధ్వంసిన్యై నమః
71. ఓం దుర్గుణ నాశిన్యై నమః
72. ఓం సంకట హారిణ్యై నమః
73. ఓం శోక వినాశిన్యై నమః
74. ఓం కర్మ ధ్వంసిన్యై నమః
75. ఓం దారిద్ర్య ధ్వంసిన్యై నమః
76. ఓం సాధు ప్రియాయై నమః
77. ఓం పూర్ణాయై నమః
78. ఓం భవ్యాయై నమః
79. ఓం విమలాయై నమః
80. ఓం నిత్యాయై నమః
81. ఓం నిష్కలాయై నమః
82. ఓం నిర్మలాయై నమః
83. ఓం నిరంజనాయై నమః

84. ఓం సమస్త జగదాధారాయై నమః
85. ఓం సమస్తజన సంతోషిణ్యై నమః
86. ఓం సంసార దుఃఖశమనాయై నమః
87. ఓం త్రిలోక మాత్రే నమః
88. ఓం పరమాత్మ హృదయాయై నమః
89. ఓం గీతాయై నమః
90. ఓం గంగాయై నమః
91. ఓం గాయత్ర్యై నమః
92. ఓం సీతాయై నమః
93. ఓం సత్యాయై నమః
94. ఓం సరస్వత్యై నమః
95. ఓం బ్రహ్మవిద్యాయై నమః
96. ఓం బ్రహ్మవల్ల్యై నమః
97. ఓం త్రిసంధ్యాయై నమః
98. ఓం ముక్తిగేహిన్యై నమః
99. ఓం అర్ధమాత్రాయై నమః
100. ఓం చిదానందాయై నమః
101. ఓం భవఘ్న్యై నమః
102. ఓం భ్రాంతినాశిన్యై నమః
103. ఓం వేదత్రయాయై నమః
104. ఓం పరాయై నమః
105. ఓం అనంతాయై నమః
106. ఓం తత్త్వార్థ జ్ఞానమంజర్యై నమః
107. ఓం శ్రీకృష్ణాయై నమః
108. ఓం శ్రీమద్భగవద్గీతా మాత్రే నమః

శ్రీమద్భగవద్గీత ఆరాధన అన్ని శుభకార్యాలలోను, పర్వదినాల లోను, ప్రత్యేకించి గీతాజయంతి పండుగ రోజున, వీలైన వారు ప్రతిరోజూ కూడా చేసుకోవచ్చు. గీతారాధన తర్వాత గీతాపఠనము చేయాలి. మనకు

వీలైనన్ని శ్లోకాలను సాక్షాత్ భగవంతుడే స్వయంగా చెప్తున్నారు అన్న భక్తి భావనతో చదివి, తాత్పర్యాన్ని అవగాహన చేసుకోవటం ఉత్తమమైన పారాయణం అవుతుంది.

ఎక్కువ శ్లోకాలు చదవలేని వారికి భగవంతుడే స్వయంగా 18వ అధ్యాయంలో 51, 52, 53 శ్లోకాలలో గీతాసారమంతా ఇమిడిపోయేలా సంగ్రహంగా చెప్పారు. కనుక ఈ మూడు శ్లోకాలనూ చదివి అర్థం చేసుకొన్నట్లయితే భగవద్గీత అంతా పఠించిన పుణ్యఫలం వస్తుందని మహాత్ములు చెపుతున్నారు. కనుక ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం ఈ మూడు శ్లోకాలనైనా భక్తి శ్రద్ధలతో చదివితే పుణ్యఫలాన్ని మూటగట్టుకొని, సకల శుభాలనూ పొందవచ్చు.

## సంక్షిప్త గీత

**బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।**
**శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥**

(అ18-శ్లో51)

**వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥**

(అ18, శ్లో52)

**అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।**
**విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥**

(అ18, శ్లో53)

తాత్పర్యము :-

నిర్మలమైన బుద్ధి కలిగి, పట్టుదలతో మనస్సును అదుపులో ఉంచుకొని, శబ్ద, స్పర్శ రూపాదులపట్ల ఆసక్తి వదలి, రాగద్వేషాలను త్యజించి, మితంగా భుజిస్తూ మనోవాక్కాయాలను అదుపులో ఉంచుకొని, దృఢమైన వైరాగ్యంతో, అహంకార బల దర్ప కామ క్రోధ పరిగ్రహాలను త్యజించి, మమకార రహితుడై శాంతచిత్తంతో ఏకాంతంగా ధ్యానయోగ

పరాయణుడైన వాడు పరమాత్మ స్వరూపస్థితిని పొందడానికి యోగ్యుడు.

ఈ విధంగా గీతను ఆరాధిస్తూ, గీతను పారాయణం చేస్తూ భగవంతుని పట్ల పూర్తి విశ్వాసంతో మనం ముందుకు నడుస్తూ ఉన్నప్పుడు మన యోగక్షేమాలను తానే స్వయంగా చూసుకుంటానని పరమాత్మే చెప్తున్నారు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥**

(అ9-శ్లో22)

'ఎవరైతే నిరంతరమూ అనన్య భక్తిభావంతో పరమాత్మనే తలచుకొంటూ పరమాత్మనే ధ్యానిస్తూ ఉంటారో అట్టి వారి యోగక్షేమాలను నేనే చూసుకొంటాను' అని భగవంతుడే స్వయంగా చెప్తున్నారు. కనుక నిరంతరం 'ఓం శ్రీ పరమాత్మనే నమః' అని స్మరిస్తూ ఉంటే మనం ఏది పొందాలో, ఎలాంటిది పొందాలో, ఎంతటిది పొందాలో, ఎప్పుడు పొందాలో ఆ తండ్రే చూసుకుంటారనే విశ్వాసంతో మన ముందు ఉన్న పని శ్రద్ధగా చేస్తూ ఉంటే చాలు. మన యోగక్షేమాలను ఆ భగవంతుడే చూస్తారు. ఇంతకన్నా మనకి ఏం కావాలి?

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ ॥**

(అ18-శ్లో78)

ఎవరి గృహంలో శ్రీమద్భగవద్గీత ఆరాధించబడుతూ, పఠించబడుతూ, అచరించబడుతూ ఉంటుందో ఆ గృహంలోని వారందరూ సుఖశాంతులతో కూడిన ధర్మబద్ధమైన విజయము, సంపద, వైభవము అనుభవిస్తూ మోక్షం పొందుతారని, శ్రీమద్భగవద్గీత మనకు తెలియజేస్తున్నది.

కనుక మీరందరూ శ్రీమద్భగవద్గీత సాక్షాత్ పరమాత్మ స్వరూపంగా భావించి, ప్రతిరోజూ ఆరాధిస్తూ అవగాహన చేసుకొని ఆచరణలోకి తీసుకొంటూ మీ జీవితంలో సకల శుభాలనూ పొందుతూ జన్మ ధన్యం చేసుకోవటానికి ఆ దేవాదిదేవుని అనుగ్రహాన్ని పొందుదురు గాక!

❖

## శాంతి ప్రార్థన

భగవంతుడు శాంతిస్వరూపుడు

శాంతిగా ఉందాం - అందరి శాంతిని కోరుకుందాం

అందరూ శాంతిగా ఉండటానికి సహకరిద్దాం

ఎవరి శాంతికి భంగం కలగకుండా ఉందాం

**ఓం సర్వేషాం స్వస్తిర్భవతు - అందరికీ శుభమే జరుగుగాక!**

**సర్వేషాం శాంతిర్భవతు - అందరూ సుఖశాంతులతో ఉందురు గాక!**

**సర్వేషాం పూర్ణం భవతు-అందరి జీవితము సమృద్ధికరముగా ఉండుగాక!**

**సర్వేషాం మంగళం భవతు-అందరి జీవితము మంగళకరముగా ఉండుగాక!**

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఈ విధంగా సాక్షాత్ పరమాత్మ స్వరూపమైన శ్రీమద్భగవద్గీతను ఆరాధించి, అందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, సమృద్ధికరంగా, మంగళకరంగా, సకలశుభాలనూ పొందుతూ ఎల్లప్పుడూ సుఖశాంతులతో ఉందురు గాక!

శుభం భూయాత్!!

## యజ్ఞ దాన తపోకర్మలు

తెలిసో తెలియకో చేసిన పాపకర్మల యొక్క ఫలితాలు మనిషిని సుఖంగా, శాంతిగా ఉండనీయకుండా ఏ పనిలోనూ ముందుకు వెళ్ళనీయకుండా అడ్డుకుంటూ ఉంటాయి. వీటి నుండి బయట పడాలనుకున్నప్పుడు యజ్ఞ దాన తపోకర్మలు ఆచరిస్తే సకల దోషాల నుండి బయటపడి పవిత్రులవుతారని శ్రీమద్భగవద్గీత తెలియచేస్తుంది.

**యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥**

(అ18-శ్లో5)

యజ్ఞదాన తపో కర్మలు ఎన్నడూ మానివేయకూడదు. ఎందుకంటే యజ్ఞదాన తపోకర్మలే మనిషిని పవిత్రుణ్ణి చేస్తాయి.

**1. యజ్ఞం :-**

(i) **జపయజ్ఞం**

**'యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి'...** (అ10-శ్లో25)

'యజ్ఞాలలో జపయజ్ఞం నా స్వరూపమే' అని ఆ దేవాదిదేవుడు చెప్పారు. అంతటి మహత్తరమైన జపయజ్ఞాన్ని - మంత్ర జపాన్ని అనునిత్యం పీఠం దగ్గర ఆచరిస్తూ, అనుక్షణమూ మంత్ర భావన చేస్తూ ఉంటే చేసిన పాపాల యొక్క దోషాలనుండి బయటపడటమే కాక ఎంతో మేలు పొందుతారు.

మంత్రం తీసుకోని వారు **'లోకా స్సమస్తా స్సుఖినో భవంతు'** - అందరూ సుఖశాంతులతో ఉందురు గాక - అనే భావనతో కాని, 'ఓం తత్ సత్' - అంతా పరమాత్మే - అనే భావనతో గాని జపం చేస్తున్నట్లయితే ఎంతో మేలు జరుగుతుంది.

(ii) **జ్ఞానయజ్ఞం :-** అనుదినము శ్రీమద్భగవద్గీత అధ్యయనం చేస్తూ ఆచరణలో పెట్టుకోవటం కంటే మిన్న అయిన సాధన మరొకటి లేనే లేదు. దీనివల్ల ఎన్నో జన్మల దోషాలన్నింటి నుండి బయటపడతారు.

(iii) **భవఘ్ను మహాశాంతి యజ్ఞం :-** శ్రీమద్భగవద్గీత శ్లోకాలతో 'ఓం తత్ సత్' - అంతా పరమాత్మే - అనే దృష్టి ఏర్పరచుకొని, మహర్షులు అందించిన శాంతి మంత్రంతో అందరి సుఖశాంతులు కోరుతూ చేసే ఈ యజ్ఞం వలన కలిగే ఫలితాలు ఇన్ని అని చెప్పటం ఎవరి తరమూ కాదు.

**2. దానం :-**

'ధర్మనిధి' ఏర్పరచుకొని ప్రతిరోజూ ఎవరి శక్త్యనుసారం వారు దానం చేస్తూ ఆ నిధిని మహత్తరమైన ఈ జ్ఞానం అందరికీ అందించటానికి ఉపయోగిస్తున్నప్పుడు మహోన్నతమైన దానాన్ని చేసిన వారు అవుతారు. ఫలితం ఆశించకుండా, గుర్తింపు కోరకుండా, సాధనా పూర్వకంగా చేసే ఈ దానం వల్ల దోషాలన్నీ తొలగి, జీవితం సమృద్ధిగా, మంగళకరంగా, సుఖశాంతులతో ఉండి ఆత్మానుభూతి పొందగలరు.

**3. తపస్సు :-**

శ్రీమద్భగవద్గీతలో 17వ అధ్యాయంలో చెప్పిన 14, 15, 16 శ్లోకాలలోని త్రివిధ తపస్సులు ఆచరిస్తున్నప్పుడు పవిత్రులై సుఖశాంతులతో జీవిస్తూ పరమపదాన్ని పొందగలరు.

(i) **శారీరక తపస్సు :-**

**దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్ ।**
**బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥**

(అ17-శ్లో14)

తా॥ తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల గౌరవ భావంతో ఉండటం, కపటం లేకపోవటం, ఎవ్వరినీ వాక్కు ద్వారా కానీ చేతల ద్వారా కానీ హింసించకుండా, ఎవరి శాంతికి భంగం కలిగించకుండా ఉండటం వంటి సద్గుణాలు ఏర్పరచుకోవాలి. దీనివల్ల మహాత్ముల ఆశీర్వాదం పొందగలుగుతారు.

(ii) **వాఙ్మయ తపస్సు :-**

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే ॥**

(అ17-శ్లో15)

తా॥ ఉద్వేగమును కలిగింపనిదియు, ప్రియమైనదియు, హితమును గూర్చునదియు, యథార్థమైనదియు అగు భాషణము - అట్లే వేదశాస్త్ర పఠనము, పరమేశ్వరుని నామజప సాధన మొదలగునవి అన్నియు వాక్కునకు సంబంధించిన తపస్సులు. ఎవ్వరినీ మాటల ద్వారా బాధ పెట్టకుండా, ఎవ్వరి గురించి చెడుగా మాట్లాడకుండా అందరికీ మేలుచేసే మాటలు ప్రేమగా మాట్లాడుతూ, భగవద్గీతా శ్లోకాలు చదువుతూ, వాటిని మననం చేస్తూ ఉండాలి.

దీనివల్ల మాట తీరుతో ఏర్పడే ఘర్షణలు తగ్గి, మైత్రీ భావన ఏర్పడి, దోషాల నుండి బయటపడి, పవిత్రులవుతారు.

(iii) **మానసిక తపస్సు :-**

**మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః ।**
**భావ సంశుద్ధిరిత్యేతత్ తపో మానసముచ్యతే ॥**

(అ17-శ్లో16)

నిరంతరము పరమాత్మను చింతన చేస్తూ ప్రతికూలమైన, చెడు ఆలోచనలు రాకుండా మనస్సు నిర్మలంగా, ప్రశాంతంగా ఉంచుకోవాలి. మానసిక తపస్సు ఆచరిస్తున్నప్పుడు ఈర్ష్య, అసూయ, ద్వేషము, కాఠిన్యం లేకుండా మనస్సు నిర్మలంగా, ప్రశాంతంగా ఉండుట వలన ఆరోగ్యపరం గానూ, ఆర్థికపరంగానూ, సామాజికంగానూ, ఆధ్యాత్మికంగానూ ఎన్నో రకాలుగా మేలు పొందుతారు.

అందరి గృహాల్లోనూ భవఘ్నిపీఠం ప్రతిష్ఠించుకొని ప్రతిరోజు క్రమం తప్పకుండా యజ్ఞ దాన తపోకర్మలు ఆచరిస్తే పాపకర్మల దోషాల నుండి బయటపడి పవిత్రులై పరమాత్మ అనుగ్రహంతో అందరూ సుఖశాంతులతో ఉంటూ మానవ జన్మ సార్థకం చేసుకోగలరు.

## గీతా జయంతి

శ్రావణ మాసం, కార్తిక మాసం ఎంతో పవిత్రంగా భావించి పూజలు చేస్తూ ఉంటారు. అయితే శ్రీమద్భగవద్గీతలో భగవంతుడు ఏం చెప్తున్నారు?

**'మాసానాం మార్గశీర్షో ఽ హం॥** (అ10-శ్లో35)

'మాసాలలో మార్గశిర మాసం నేనే' అని భగవంతుడే స్వయంగా చెప్తున్నారు. అంటే మార్గశిర మాసంలోని ప్రతి రోజూ కూడా ఎంతో పవిత్రమైన పుణ్యకాలమే కదా! అంతే కాక భగవంతుని బోధ స్వరూపమైన శ్రీమద్భగవద్గీత మనకు అందినది కూడా ఈ పవిత్రమైన మార్గశిర మాసంలోనే కదా! ఇంతటి విశిష్టమైన శుభప్రదమైన మార్గశిర మాసంలో ప్రతిరోజూ పరమాత్మ ప్రార్థన చేసుకొని, పరమాత్మ స్వరూపంగా శ్రీమద్భగవద్గీతను ఆరాధిస్తూ, పఠిస్తూ ఉంటే ఆ ఇంట్లోని వారందరూ సకల సౌభాగ్యాలతో, సుఖశాంతులతో ఉంటారని మహాత్ములు చెపుతున్నారు.

అందువల్ల మార్గశిర మాసం ప్రారంభమైన రోజు (పాడ్యమి) నుండి చివరి రోజు (అమావాస్య) వరకు ప్రతి రోజూ, ప్రతి ఇంట్లోనూ పరమాత్మ ప్రార్థన చేసుకుంటూ, శ్రీమద్భగవద్గీతను ఆరాధిస్తూ, గీతను పఠిస్తూ ఉన్నట్లయితే సకల శుభాలనూ పొందవచ్చు. మార్గశిర మాసంలో మొత్తం రోజులన్నీ గీతారాధన చేసుకొనడానికి కుదరని వారు మార్గశిర మాసం మొదటి రోజు (పాడ్యమి) నుండి గీతాజయంతి అంటే ఏకాదశి వరకు పదకొండు రోజులైనా గీతారాధన చేసుకొనవచ్చు. అది కూడా కుదరని సందర్భంలో గీతా జయంతి రోజునైనా గీతా పఠనము, గీతారాధన సంతృప్తిగా చేసుకొని పరమాత్మ అనుగ్రహాన్ని పొందవచ్చు.

మనిషి సకల పాపములనుండి, సకల దోషముల నుండి, సకల దుఃఖముల నుండి బయటపడి సుఖంగా, శాంతిగా, సంతోషంగా, సంతృప్తిగా జీవిస్తూ మానవజన్మకు లక్ష్యమైన మోక్షం పొందటానికి భగవత్ స్వరూపులైన శ్రీ వేదవ్యాస మహర్షులవారు పుణ్య మార్గశిర మాసంలో శుక్ల ఏకాదశి పర్వదినమున సకలశాస్త్ర సారమైన శ్రీమద్భగవద్గీతా గ్రంథరాజమును మానవాళికి ప్రసాదించారు.

మానవ జన్మ సార్థకం చేసుకోవడానికి కావలసిన మహోన్నతమైన పరమజ్ఞాన భాండాగారమైన శ్రీమద్భగవద్గీత మనకందిన రోజైన మార్గశిర శుక్ల ఏకాదశి రోజును మనిషై పుట్టిన వారెవరు మరువనే మరువకూడదు. ఆ రోజు గీతాజయంతి పండుగ రోజు. అన్ని పండుగల కంటే ఎంతో విశిష్టమైన పండుగ రోజు.

ఆనాటి నుండి ఈనాటి వరకు ఎందరో మహర్షులు, మహాత్ములు, యోగులు అందరూ కూడా 'గీతాజయంతి పండుగ' వేడుకగా చేసుకొంటూ, గీతారాధన, గీతాపఠనం గావిస్తూ, గీతాజయంతి శుభాకాంక్షలు ఒకరికొకరు తెలియజేసుకొంటూ, అదే విధంగా ప్రజలందరూ కూడా గీతా జయంతి పండుగ జరుపుకోవాల్సినదిగా ఉపదేశిస్తున్నారు.

ప్రపంచంలో ఎప్పుడూ ఎక్కడా కూడా ఒక గ్రంథానికి జయంతి జరుపుకోవడమన్నది ఎవ్వరూ ఎప్పుడూ కనీ వినీ ఉండరు. ప్రపంచంలోనే ఇదొక అద్భుతమైన విషయం అవుతుంది. ఈ ప్రత్యేకత, ఈ గౌరవం కేవలం శ్రీమద్భగవద్గీతకు మాత్రమే చెందుతుంది అనటంలో అతిశయోక్తి లేదు.

గీతాజయంతి పండుగ జరుపుకోవడమన్నది సనాతనమైన మన

సంప్రదాయం. శ్రీమద్భగవద్గీత సాక్షాత్ పరమాత్మ స్వరూపంగా భావించి, గీతాజయంతి రోజున గీతారాధన, గీతాపఠనం చేయుటమనేది భగవంతుని పట్ల మనకున్న విశ్వాసాన్ని, భక్తి శ్రద్ధలనూ తెలియచేస్తుంది.

ఈ సంప్రదాయానికి, సంపదకు, వైభవానికి మనం వారసులమనే విషయాన్ని ఎన్నటికీ మరచిపోకుండా, ఈ సంప్రదాయాన్ని తరతరాలకు అందిస్తూ ఉండాలి. శ్రీమద్భగవద్గీత పట్ల మాకు విశ్వాసం ఉంది అనుకొనే ప్రతి ఒక్కరూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉండాలి. ఇది భగవంతునికి చేసే సేవలలో ఉత్తమోత్తమమైనది అవుతుంది.

కనుక మార్గశిర శుక్ల ఏకాదశి పర్వదినాన కుటుంబ సభ్యులందరూ కలిసి బంధుమిత్రులకు, ఇరుగు పొరుగు వారందరికీ గీతాజయంతి శుభాకాంక్షలు తెలియజేసి, వారందరిని ఆహ్వానించి, భక్తిశ్రద్ధలతో అష్టోత్తర శతనామావళితో గీతారాధన చేసుకొని, గీతా పారాయణం చేసుకొన్నట్లయితే వారందరూ భగవదనుగ్రహపాత్రులై సకల శుభాలను పొందుతూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖంగా శాంతిగా జీవిస్తూ జన్మ సఫలం చేసుకోగలుగుతారు.

**జై గురుదేవ్!**

**భవఘ్ని మర్మయోగ విద్యాలయం, వైకుంఠపురం**

అమరావతి మండలం, గుంటూరు జిల్లా - 522020

**www.bhavaghni.net**